తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## బోగస్ ఓటర్లు ఉంటే తొలగించండి

**- బీఎల్‌వోలను ఆదేశించిన కలెక్టర్ వెంకటరమణారెడ్డి**

బాలాయపల్లి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:



బోగస్ ఓటర్లు ఉంటే వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం వెంగమాంబపురం గ్రామంలో కలెక్టర్ ఇంటింటికి వెళ్లి ఓటర్లను జాబితాలో ఉన్నారా లేదా అని పరిశీలించారు. బోగస్ ఓటర్లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. లేదంటే చర్యలు తప్పవన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశం మేరకు బోగస్ ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీవో కిరణ్‌కుమార్, తహసీల్దారు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం అడపారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. తిరుపతిరూరల్ దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని అడపారెడ్డిపల్లిలో టిప్పర్‌ను అన్‌లోడ్ చేస్తుండగా పైనున్న 11కెవి లైన్ తగలడంతో తేజరెడ్డి (24)అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. టిప్పర్ పైభాగం 11కెవి విద్యుత్ లైన్‌కు తగలడంతో టిప్పర్‌లో మంటలు చెలరేగి, డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటనపై ముత్యాలరెడ్డి పోలీసులు కేసు నమోదు చేసారు. పోస్టుమార్టం నిమిత్తం తేజ మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు తరలించారు.

# సమాజంలో దైవ స్వరూపులుగా గురువులు

### విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సిఎం జగన్ : రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా

### మహతి కళాక్షేత్రంలో ఘనంగా "గురుపూజోత్సవ" వేడుకలు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మంత్రి రోజా,ఎమ్మెల్సీ సిపాయి,కలెక్టర్ వెంకట రమణారెడ్డి

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

విద్యా వ్యవస్థలో వినూత్నమైన విప్లవాత్మక మార్పులు తెచ్చి విద్యకు పెద్దపీట వేసిన గొప్ప వ్యక్తి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పర్యాటక,యువజన,సాంస్కృతిక,క్రీడల శాఖా మంత్రి ఆర్‌కె.రోజా అన్నారు.మంగళవారం స్థానిక మహతి కళాక్షేత్రంలో జరిగిన "గురుపూజోత్సవ" వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి రోజా,ఎమ్మెల్సీ డా॥సిపాయి సుబ్రహ్మణ్యం,జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డిలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి,మాజీ రాష్ట్రపతి డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ నిత్యం మనం గురువులను స్మరించుకోవాలన్నారు.మన సమాజంలో దైవ స్వరూపులుగా గురువులకు స్థానం ఉందన్నారు.మంచి విలువలు కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి మార్గంలో వారి భావి భవిష్యత్తుకు నాంది పలుకుతారన్నారు.నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యా వ్యవస్థకు ధీటుగా భోధనా వసతులు నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్నాయని, డిజిటల్ విద్య అందుబాటులోకి తెచ్చామన్నారు.విద్యార్థుల ఉన్నతికి అమ్మఒడి,విద్యా కానుక,వసతి దీవెన,విదేశీ విద్య,జగనన్న గోరుముద్ద తదితర పథకాలు అమలు చేస్తూ,70 వేల కోట్లు విద్యాశాఖ నుండి ఖర్చు చేయడం జరిగిందన్నారు.గురువులు విలువలతో కూడిన విద్యను అందించాలని ఆమె కోరారు.తరువాత జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురుపూజోత్సవం నిర్వహించి ఉపాధ్యాయులను సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఉపనాధ్యాయులకు శుభాకాంక్షలు,విద్యార్థులకు శుభాశీస్సులు తెలిపారు.అనంతరం ఎమ్మెల్సీ డా॥సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గురువలను మించిన దైవం లేదని,భగవంతుడిని మించిన స్వరూపం గురవని అన్నారు. అనంతరం తిరుపతి జిల్లాలో ఉత్తమ సేవలందించి పురస్కారాలు పొందిన 76 మంది ఉపాధ్యాయులకు మంత్రి, ఎమ్మెల్సీ, కలెక్టర్‌లు కలిసి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందచేసి అభినందనలు తెలియచేశారు.ఈ వేడుకల్లో భాగంగా పాఠశాలల చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులుగా జిల్లా విద్యాశాఖాధికారి డా॥వి.శేఖర్ నిర్వహించగా, ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ ఎస్ఎస్ఎ రామచంద్రారెడ్డి,ఎస్ఎస్ఎ సిబ్బంది, ఎంఈఓలు,ఉపాధ్యాయులు,పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యకు ప్రాధాన్యం

**- ఉపాధ్యాయ దినోత్సవంలో ఎంపీ రెడ్డప్ప**

చిత్తూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ రెడ్డప్ప పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఎంపీ రెడ్డప్ప, ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ విజ్ఞానానికి మారుపేరు గురువు అని, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురువుగా విద్యాభివృద్ధికి చేసిన సేవలు ఆదర్శనీయమని, ఆయన జన్మదినం పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా గురుపూజోత్సవం జరుపుకొంటున్నామన్నారు. గురువులు తమ కన్న బిడ్డలకంటే మిన్నగా తమ వద్ద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఆదరిస్తారన్నారు. ఉపాధ్యాయులు తమ విద్యాబోధనతో సమాజంలో మార్పు తెచ్చి సమ సమాజ స్థాపనకు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉత్కృష్టమైన విలువలు, అంకితభావంతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వహిస్తున్న వారిని సమాజం మహానుభావులుగా కొనియాడుతుందన్నారు. అంకితభావంతో విద్యాభివృద్ధికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విశిష్ట సేవలు అందించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి వినూత్నమైన ప్రణాళికలు రూపొందించడంలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య భారం కాకూడదని ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పడంలో నైపుణ్యంను సంపాదించుకొని క్షేత్ర స్థాయిలో అమలు చేసి విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పించి వారి భావి



భవిష్యత్ తరాలను ధృడంగా తయారు చేయాలన్నారు. ఉపాధ్యాయ వృత్తులు చేపట్టిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, డాక్టర్ అబ్దుల్ కలాం లాంటి వారిని నేటి ఉపాధ్యాయులు స్మరించుకొని ఉన్నత విలువలు కల్గిన గురువులుగా ఎదదాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డప్ప, ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.శ్రీనివాసులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మంది హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, జడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్మన్ కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, చిత్తూరు డివైఇఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతిలో అచ్యుతం, శ్రీపథం

# వసతి సముదాయాలు

- -రూ.600కోట్లతో నిర్మాణాలు
- -బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్యం అదనపు కార్మికులకు రూ.32.73లక్షలు
- -చంద్రగిరి మూలస్థాన యల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రూ.2కోట్లుతో టెండర్
- -టిటిడి ఆస్పత్రులు,డిస్పెన్సరీల్లో మందులకు రూ.2.46కోట్లు
- -మూడోమైలు తిరుచానూరురోడ్డు నాలుగులేన్లుగా విస్తరణ
- -తిరుపతిలో రోడ్లు అభివృద్ధికి తొలిప్రాధాన్యత



తిరుమల,సెప్టెంబర్ 5 ప్రభాతవార్తప్రతినిధి:

ప్రతిరోజూ తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపవుతున్న నేపథ్యంలో తిరుపతిలో యాత్రికులకు మరింత సౌకర్యవంతంగా వసతి కల్పించేందుకు పురాతన గోవిందరాజస్వామి సత్రాలు 2,3 స్థానంలో 600కోట్ల రూపాయలతో అచ్యుతం, శ్రీపథం వసతిసముదాయాలు నిర్మించేందుకు టిటిడి బోర్డు ఆమోదించింది. అధునాతనంగా అన్ని సౌకర్యాలతో ఈ వసతిసముదాయాలు నిర్మాణం జరిగితే రైల్వేస్టేషన్‌కు,ఆర్టీసి బస్టాండుకు యాత్రికులకు మరింత సౌలభ్యంగా ఉంటుందన్నారు. తిరుమలలో జరిగే సాలకట్ల,నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో పారిశుధ్యనిర్వహణకు అదనపు సిబ్బందికి 32.73లక్షలు రూపాయలు మంజూరుకు ఆమోదం తెలిపారు. చంద్రగిరి మూలస్థాన యల్లమ్మ ఆలయం పునర్నిర్మాణానికి 2కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచేందుకు తీర్మానించారు. 49.48కోట్ల రూపాయలతో టిటిడి ఉద్యోగులకు 1,476క్వార్టర్ల మరమ్మతులు చేపట్టేందుకు ఆమోదించారు. కేశవాయనగుంట వద్ద టిటిడిఉద్యోగులు నివాసముంటున్న చోట అభివృద్ధికి 4.15కోట్లు కేటాయింపు.మంగళవారం ఉదయం టిటిడి 53వ ధర్మకర్తలమండలి తొలిసమావేశం ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన అన్నమయ్యభవనంలో జరిగింది. పలు అంశాలపై చర్చించి తిరుమల,తిరుపతిలో అభివృద్ధికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ వివరాలను మధ్యాహ్నం ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి మీడియా ప్రతినిధులకు వెల్లడించారు.తిరుపతికి వచ్చేయాత్రికులు పద్మావతిఅమ్మవారి దర్శనానికి సులభంగా చేరుకునేందుకువీలుగా రేణిగుంట రోడ్డులోని నారాయణాద్రి కూడలి నుండి తిరుచానూరువైపు ఉన్న రోడ్డును 150 అడుగుల నాలుగులేన్ల బైపాస్‌గా అభివృద్ధిచేయాలని నిర్ణయించారు. తిరుపతిలో శ్రీనివాసం వసతిసముదాయం పక్కన ఉన్న వైఎస్ఆర్ మార్గం నుండి సామవాయి మార్గం వరకు 9.60కోట్లతో 40అడుగుల రోడ్డునిర్మాణం, మంగళం రోడ్డులోని ఆర్‌టిఓ కార్యాలయం నుండి రేణిగుంటరోడ్డులోని పద్మావతిఫ్లోర్‌మిల్లు వరకు19.50కోట్లతో 2.90కిలోమీటర్లు దూరం 80అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణానికి ఆమోదించారు.రేణిగుంటరోడ్డులోని హీరోహోండా షోరూమ్ నుండి తిరూచానూరురోడ్డులోని గ్రాండ్‌రిడ్జ్‌వరకు బైపాస్‌రోడ్డుకు చేరుకునేలా 4కోట్లతో రోడ్డు నిర్మాణానికి అనుమతి.ఎండిపుత్తూరునుండి మంగళం పంపింగ్ స్టేషన్ వరకు 1100ఎంఎండయావాటర్‌పైప్‌లైన్ ఏర్పాటుకు తిరుపతి నగరపాలక సంస్థకు వడ్డీలేని రుణం మంజూరుకు అనుమతినిచ్చారు. టిటిడి ఆస్పత్రుల వద్దనుండి ప్రత్యేక డ్రైనేజీ నీటి నిర్వహణకు స్విమ్స్ కూడలినుండి టౌన్‌క్లబ్‌మీదుగా కృష్ణాపురంఠాణా వరకు నగరపాలకసంస్థ ద్వారా డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. 33కోట్లరూపాయలతో వడమాలపేట అరణ్యంవద్ద టిటిడి ఉద్యోగుల ఇళ్ళస్థలాలకు కేటాయించిన స్థలంలో రోడ్లు,మౌళిక వసతులకు ఆమోదంతెలిపారు.ఈ తొలిసమావేశంలో టిటిడి ఈఓ ధర్మారెడ్డి, జెఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం,సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

నాయుడుపేట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త





కంటైనర్ క్యాబిన్‌లో ఇరుక్కుని మృతిచెందిన డ్రైవర్, ప్రమాదంలో మృతిచెందిన రమేష్

నాయుడుపేట మండలం నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం జాతీయ రహదారి వద్ద పనులు చేస్తూ నిలిపి ఉన్న మినీ లారీని కంటైనర్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రోడ్డు పనులు చేసునతన్న రమేష్‌తో పాటు కంటైనర్ లారీడ్రైవర్ మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. నరసారెడ్డికండ్రిగ వద్ద హైవేపై మినిలారీని రోడ్డుపక్కన నిలిపి సిబ్బంది పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు వెళుతున్న కంటైనర్ లారీ నరసారెడ్డికంర్డిగ వద్దకు వచ్చేసరికి ముందు టైరు పంచర్ కావడంతో అదుపుతప్పింది. రోడ్డుపక్కన నిలిపి ఉన్న మినీలారీని ఢీకొని పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. కంటైనర్ ఢీకొన్న మినీ లారీ బోల్తా పడటంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న రమేష్ లారీ కిందపడి దుర్మరణం పాలయ్యాడు. కంటైనర్ లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోయి మృతిచెందాడు. పోలీసులు ట్రాఫిక్‌ను దారిమళ్లించి వాహనాలను జెసిబి సహాయంతో పక్కకు తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పల్టీలు కొట్టిన అపాచీ బస్సు



తడ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త

తడ మండలం మాంబట్టు వద్దనున్న అపాచీ పరిశ్రమకు కార్మికులను తీసుకువెళ్తున్న బస్సు మంగళవారం బోల్తా కొట్టింది. తడ బత్తాలవల్లం మధ్యలో ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో బస్సులో ఎక్కువ మంది కార్మికులు వుండడంతో స్థానికులు కంగారుపడ్డారు. అయితే కార్మికులంతా గాయాలతో బయటపడ్డారు. దీనితో ఊపిరి పీల్చుకున్నారు. వరదయ్యపాలెం మండలం నుండి ఈ బస్సు అపాచీకి వెళ్తూ చిలమట్టూరు రోడ్డు నుండి పల్లపు ప్రదేశంలో పల్టీలు కొట్టింది. ఈ ప్రాంతంలోని పరిశ్రమల పెద్దలు నిత్యం వేలాది మంది కార్మికులను వందలాది బస్సులలో తరలిస్తున్నారు. ఆయా మార్గాలలో రోడ్ల దుస్థితిని కూడా పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

## సంక్షేమ వసతి గృహాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలోని పలు ఐసిడిఎస్ కేంద్రాలు, అంగన్‌వాడి కేంద్రాలు, రేషన్ షాపులు, సంక్షేమ వసతి గృహాలు తదితరు వాటిని ఆకస్మికంగా మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి, సభ్యురాలు జి. దేవిలు తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా జిల్లాలోని వెంకటగిరి, డక్కిలి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్ చంద్రగిరి తదితర మండలలోవిస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా అంగన్వాడి కేంద్రాలో కొన్ని లోపాలను గుర్తించి, వాటిని సరిచేయాల్సిందిగా పిడి, ఐసిడిఎస్ వారికి తగు సూచనలు జారీ చేసారు. ఈ పర్యటనలో కమిషన్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం. రాజ రఘువీర్, జిల్లా విద్యాశాఖ అధికారి, పిడిఐసిడిఎస్, జిల్లా పౌర సరఫరాల కార్పొరేషన్ డిఎం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రిచే రాహుకేతు పూజలు: రాష్ట్ర మాజీ మంత్రి దర్శనం





ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తుల తాకిడితో పాటు అతిధుల తాకిడి కూడా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయానికి రాష్ట్ర మాజీ మంత్రి కొడాలి నాని కుటుంబసభ్యులతో హాజరై పూజలు జరిపించుకున్నారు. ప్రోటోకాల్‌మేరకు కార్య నిర్వహణాధికారి కె వి సాగర్ బాబు స్వాగతం పలికారు. ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**కేంద్ర మంత్రి రాహుకుతుదోష నివారణ పూజలు:**

కేంద్ర సహకార శాఖ మంత్రి బి.ఎల్.వర్మ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. ఆయన ఆలయంలో నిర్వహించే కాలసర్పదోష నివారణ పూజలు జరుపుకోవాలని కోరారు.ఇఓ కె వి సాగర్‌బాబు వెంటనే ఏర్పాట్లు చేసారు. సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులతో పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయంలో దర్శనాలు ఏర్పాట్లు చేసారు. ఏర్పాట్లును ఎఇఓ సతీష్‌మాలిక్‌టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు.కాగా మాజీ మంత్రి కొడాలి నానికి శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ శ్యాం ప్రత్యేకంగా సత్కరించారు. వెంకటేశ్వరస్వామి దారుశిల్పాన్ని అందించారు.

### మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం పనులు

# వేగవంతం చేయండి

**కమిషనర్ హరిత**



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త

నగర అభివృద్ధికి ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మాస్టర్ ప్లాన్ రోడ్ల పనుల పురోగతి, టిడిఆర్ బాండ్లు పంపిణీపై తన ఛాంబర్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో ఆలస్యం జరుగుతోందని ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. నగరంలో రోడ్ల అభివృద్ధికి తమ స్థలాలను ఇచ్చినటువంటి వారిని ఎన్ని సార్లు కలిసైనా వారి భూములను రిజిస్ట్రేషన్ చేసేలా చూడాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, టిపిఓలు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## పారదర్శకతకు, భద్రతకు నూతన రిజిస్ట్రేషన్ విధానం పెద్దపీట

**జిల్లా రిజిస్టర్ శ్రీరామ కుమార్**




తిరుపతి రవాణా, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన రిజిస్ట్రేషన్ విధానం పారదర్శకతకు, భద్రతకు పెద్ద పీట వేస్తుందని తిరుపతి జిల్లా రిజిస్టేర్ శ్రీరామకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రిజిస్ట్రేషన్ విధానంతో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదని అన్నారు. 1999లో రిజిస్ట్రేషన్ శాఖను కంప్యూటరీకరించడం జరిగిందని, అప్పుడు రూపొందించిన సాఫ్టువేర్‌ను ఇప్పటికీ అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉత్తమ విధానాలను పరిగణలోకి తీసుకుని ఈ నూతన సాఫ్టువేర్‌ను రూపొందించడం జరిగిందన్నారు. ఈ సాఫ్టువేర్ అప్లికేషన్‌లో క్రయ, విక్రయ దారుని పేరుతో పాటు ఆస్తి వివరాలను నమోదు చేయగానే ఒక మోడల్ డాక్యుమెంట్ జనరేట్ అవుతుందన్నారు. అయితే అదనంగా ఏమన్నా క్లాజులను జోడించాలనుకుంటే 20 క్లాజుల వరకూ ఈ అప్లికేషన్‌లో జోడించే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కమిషనర్, ఐజి వి. రామకృష్ణ మాట్లాడుతూ ఈ నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రయోగాత్మకంగా కొన్ని కేంద్రాల్లో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఫిజిక్ డాక్యుమెంట్ కావాలనుకునే వారికి ఇ స్టాంపుపైనే ప్రింట్ చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు దేవాదాయశాఖ మంత్రికి ఆహ్వానం

కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి 2023 సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు మంగళవారం దేవస్థానం తరపున ఆహ్వానపత్రికలను అందజేశారు. కాణిపాకం దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ 8 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు ఈఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు మంత్రి కొట్టు సత్యనారాయణను విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలసి ఆహ్వానపత్రికలను అందజేశారు. అలాగే స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



